క్లుప్తంగా

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం


బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ కామేశ్వరరావు

పెదగంట్యాడ: శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తానని న్యూపోర్టు సీఐ తోటాడ కామేశ్వర రావు అన్నారు. న్యూపోర్టు పోలీస్ స్టేషన్ సీఐగా బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర ప్రవృత్తి కలిగిన వారు తమ పంథా మార్చుకోక పోతే కఠినమైన చర్యలు తీసుకోవడం ఖాయమని హెచ్చరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన దాలి బాబు సీసీఎస్–1కు బదిలీ అయ్యారు.

యూనియన్ బ్యాంక్‌లో ఆధార్ నమోదు కేంద్రం


ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బ్రాంచ్ మేనేజర్

అగనంపూడి: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అగనంపూడి బ్రాంచ్ ఆవరణలో ఆధార్ నమోదు కేంద్రాన్ని బుధవారం బ్యాంక్ మేనేజర్ బి.నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 79, 85 వార్డుల్లోని ప్రజల సౌకర్యార్థం బ్యాంక్ ఆవరణలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కొత్త కార్డుల నమోదు, కార్డుల్లో తప్పులు దొర్లితే సరిచేసుకోవడం, పేర్లు, ఇతర వివరాలు మార్పులు చేర్పులకు అవకాశం ఉంటుందని తెలిపారు.

ఏబీసీడీగా వర్గీకరించాలని వినతి


రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం: బాబూ జగ్జీవన్ రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్సీలను ఏబీసీడీగా వర్గీకరించాలని కోరుతూ పెదగంట్యాడ, గాజువాక ప్రాంత మాదిగ, ఎమ్మార్పీ ఎస్, ఎంఈఎఫ్ నాయకులు బుధవారం కలెక్టరేట్‌లో ఏకసభ్య కమిటీ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, గంట్యాడ గోవిందరాజు, డాక్టర్ రాజారావు, దేవులపల్లి సంపూర్ణం, ములకలపల్లి వెంకటేష్, కనితి సురేష్, వెంకటరమణ, గంట్యాడ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతతో ప్రశాంత జీవనం


ప్రవచిస్తున్న సుశీలాజీ

విశాఖ విద్య: వేదాంత ఇన్‌స్టిట్యూట్ విశాఖపట్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏయూలోని వైవీఎస్‌మూర్తి ఆడిటోరియంలో భగవద్గీత 10వ అధ్యాయం 'విభూతి యోగం'పై ఇంగ్లిష్‌లో ఐదు రోజుల జ్ఞాన యజ్ఞం(ప్రవచనాలు) బుధవారం ప్రారంభమయ్యాయి. స్వామి పార్థసారథి శిష్యురాలైన సుశీలాజీ ప్రవచిస్తూ నిజ జీవితంలో ప్రశాంత జీవితం గడపడానికి కావాల్సిన మెళకువలు తెలిపే తత్వజ్ఞానాన్ని అందించేదే భగవద్గీతని చెప్పారు. విభూతి యోగంలోని 42 శ్లోకాలు, వాటి భావాలను నిత్య జీవితంలో ఎలా ఆచరించాలో తెలియజేశారు. ముందుగా భజన కీర్తనలు ఆలపించారు. అధిక సంఖ్యలో నగర వాసులు, వేదాంత ఇన్‌స్టిట్యూట్ విశాఖపట్నం ట్రస్ట్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఐటీఐలో జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో మేధా సర్వో డ్రైవ్స్ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగాల భర్తీ కోసం శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ధ్రువపత్రాలతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 99668 61476లో సంప్రదించాలని సూచించారు.


ఆటోనగర్ దోజ్‌కో కంపెనీ నుంచి పాతగోద్రేజ్ కంపెనీ వైపు మలుపు
మింది జెడ్పీ హైస్కూల్ ఎదురుగా మలుపు

అమ్మో.. మలుపులు!

మలుపుల మాటున ముప్పు పొంచి ఉంది. ఏ మాత్రం ఏమర పాటుగా ఉన్నా అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా లేకపోవడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొని పలువురు క్షతగాత్రులవుతున్నారు. దీంతో ఆ మలుపులు అంటే వాహనచోదకులు బెంబేలెత్తుతున్నారు. కనీసం సూచిక బోర్డులు అయినా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

- కానరాని హెచ్చరిక బోర్డులు
- గుర్తించలేక ప్రమాదాలు
- బెంబేలెత్తుతున్న వాహన చోదకులు

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు మలుపులు తికమకగా ఉన్నాయి. దీంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మలుపుల వద్ద ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరినా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని వాహన చోదకులు ఆరోపిస్తున్నారు.

అప్రమత్తత ఏదీ?

పలు మలుపుల వద్ద హెచ్చరికలు గాని, మలుపులను గుర్తించే బోర్డులు లేకపోవడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మరోవైపు మలుపులు ఉన్న ప్రాంతంలోనే రోడ్డు గోతులు తేలి ప్రమాదకరంగా ఉండడం మరో ఇబ్బందికర పరిస్థితి.

ప్రమాదకరమైన మలుపులు ఇవే...

- ఆటోనగర్‌లోని చుక్కవానిపాలెం వద్ద వడ్లపూడి రైల్వే క్యాబిన్ వైపు రైల్వే క్రాసింగ్ ముందు మలుపు ప్రమాదకరంగా ఉంది. దీనికి తోడు మలుపు వద్ద రోడ్డు పూర్తిగా శిథిలమైంది. ఈ ప్రాంతంలో భారీ వాహనాలు రాకపోకల సమయంలో వాహనాలు ఎదురెదురుగా ఢీ కొని ప్రమాదాలు సంభవిస్తున్నాయి.
- ఆటోనగర్‌లో దోజ్‌కో కంపెనీ నుంచి పాత గోద్రెజ్ కంపెనీ వైపు వెళ్లే మార్గంలో మలుపు ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ హెచ్చరిక బోర్డులు కానీ, సిగ్నల్ వ్యవస్థ లేకపోవడంతో పరిమితికి మించిన వేగంతో వాహనాలు రాకపోకలు సాగిస్తుడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.
- రాంనగర్ మింది నుంచి జింక్ గేటు వైపు వెళ్లే మార్గంలో ఆంజనేయ స్వామి ఆలయం పక్కన, మింది జెడ్పీ హై స్కూల్ ఎదురుగా మలుపులు ప్రమాదాలను ఆహ్వానించేలా ఉన్నాయి. జింక్ నుంచి వచ్చే వాహనాలు, రాంనగర్ , మింది నుంచి వెళ్లే వాహనాలు మలుపు వద్ద ఎదురెదురుగా వచ్చి ప్రమాదాలకు గురవుతున్నాయి.


ఆటోనగర్ నుంచి వడ్లపూడి రైల్వే క్రాసింగ్ వెళ్లే వైపు ప్రమాదకరంగా మలుపు

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



ఆటోనగర్ నుంచి రైల్వే క్రాసింగ్ వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఆటోనగర్ నుంచి చుక్కవానిపాలెం నిర్వాసిత కాలనీ వద్ద మలుపు ఇబ్బంది కరంగా ఉంది. ఇక్కడే రోడ్డు కూడా గోతులు తేలి ప్రమాదకరంగా ఉంటుంది. ఇరువైపుల నుంచి వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనాలు ఎదురెదురు పడి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అధికారులు హెచ్చరిక వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

– సయ్యద్ హుస్సేన్, అక్కిరెడ్డిపాలెం

అధికారులు స్పందించాలి



మలుపులు ఉన్న ప్రాంతాల్లో ప్రమాదాల నివారణపై అధికారులు దృష్టి సారించాలి. మలుపులు వద్ద రోడ్లు సరిగ్గా లేకపోవడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. చిన్నచిన్న దెబ్బలు తగిలిన వారు బయటకు చెప్పుకోలేక పోతున్నారు. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, సిగ్నల్ వ్యవస్థ గానీ ఏర్పాటు చేయాలి.

– వసంత్, హెచ్‌జీ పాలెం

శభాష్ పోలీస్

- డెహ్రాడూన్‌లో యువతిని పట్టుకున్న పోలీసులు
- తల్లిదండ్రులకు అప్పగింత


కొల్లి లావణ్య పార్వతిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్‌ఐ సూర్యకళ

అక్కిరెడ్డిపాలెం: కళాశాలకు అని వెళ్లిన కుమార్తె తిరిగి రాలేదని తల్లిదండ్రులు గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టారు. ఆ విద్యార్థిని డెహ్రాడూన్‌లో ఉన్నట్టు గుర్తించిన పోలీసులు అక్కడికి వెళ్లి విద్యార్థినిని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. గాజువాక ఏసీపీ టి.త్రినాథ్, సీఐ పార్థసారథి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక నరవ ప్రాంతానికి చెందిన కొల్లి ఎరుకునాయుడు కుటుంబం నివసిస్తోంది. ఈ నెల 10వ తేదీన బీటెక్ చదువుతున్న కుమార్తె లావణ్య పార్వతిని కొన్ని కారణాల వల్ల మందలించారు. అలిగిన ఆమె అదే రోజు కాలేజ్‌కు వెళ్తానని చెప్పి డెహ్రాడూన్ వెళ్లిపోయింది. కళాశాలకు వెళ్లి తిరిగి కుమార్తె ఇంటికి రాకపోవడంతో గాజువాక పోలీసులను ఆశ్రయించారు. సౌత్ ఏసీపీ త్రినాథ్, సీఐ పార్థసారథిల ఆధ్వర్యంలో స్పెషల్ టీం ఏర్పాటు చేశారు. దర్యాప్తులో భాగంగా విద్యార్థిని డెహ్రాడూన్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఎస్‌ఐ సూర్యకళ తన టీంతో కలిసి ఈ నెల 16న డెహ్రాడూన్ వెళ్లి లావణ్య పార్వతిని పట్టుకున్నారు. బుధవారం తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం: 11 కేవీ శీలానగర్, 11 కేవీ పోర్టు రోడ్డు ఫీడర్, 11 కేవీ జగ్గయ్యపాలెం ఫీడర్, 11 కేవీ వేంకటేశ్వరకాలనీ ఫీడర్లకు సంబంధించి 33/11 కేవీ శీలానగర్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జోన్ – 2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శీలానగర్, హరిజనజగ్గయ్యపాలెం, గవరజగ్గయ్యపాలెం, వెంకటేశ్వరకాలనీ, పోర్టు రోడ్డు ఏరియా, కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ఏరియా, కుమ్మీ లేఅవుట్ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి


డాక్టర్ రాధాకుమారిని సత్కరిస్తున్న ఐద్వా ప్రతినిధులు

ఉక్కునగరం: మహిళలు కుటుంబ సభ్యుల ఆరోగ్యంతో పాటు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఉక్కు జనరల్ ఆస్పత్రి గైనకాలజిస్టు డాక్టర్ రాధాకుమారి అన్నారు. ఐద్వా స్టీల్ డివిజన్ ఆధ్వర్యంలో బుధవారం ఉక్కునగరంలో జిల్లా శ్రామిక మహిళా సంఘం కన్వీనర్ బి. శారద వర్ధంతి సందర్భంగా 'మహిళల ఆరోగ్య సమస్యలు – పరిష్కారం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆమె మాట్లాడుతూ మహిళలు పీరియడ్స్ సమయంలో 3 నుంచి 5 రోజుల కంటే ఎక్కువ రక్తస్రావం అయితే వైద్యులను సంప్రదించాలన్నారు. పీసీవో, పాలిసిస్ సమస్యలకు జీవనశైలిలో మార్పుతో చెక్ పెట్టవచ్చునన్నారు. జోన్ ఉపాధ్యక్షురాలు కె. విమల అధ్యక్షత వహించిన కార్యక్రమంలో అధ్యక్షురాలు వరలక్ష్మి, ఎ.ఎస్.ప్రభ, సుమలత, ఎం. విజయలక్ష్మి, కె.వరలక్ష్మి, బి. పద్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి బియ్యం తులాభారం


తులాభారంలో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో భక్తులు శ్రీవారికి వివిధ రూపాల్లో కానుకలు అందజేస్తున్నారు. ధనుర్మాసం సందర్భంగా బుధవారం వెంకన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దివ్యక్షేత్రంలో సబ్బవరానికి చెందిన షణ్ముఖ హర్ష బియ్యం తులాభారాన్ని సమర్పించారు.

బాల్యవివాహాలతో అనర్థాలు


సమావేశంలో మాట్లాడుతున్న మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ జయదేవి

పెదగంట్యాడ: బాల్య వివాహాల నిరోధానికి, బాలికల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు కృషి చేస్తామని మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ జయదేవి అన్నారు. పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి నీలవేణి అధ్యక్షతన పెదగంట్యాడలోని జీవీఎంసీ కల్యాణ మండపంలో బుధవారం బాల్య వివాహాల వల్ల అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికల సమస్యలను వివరించారు. సమాజంలో మహిళలు, బాలికల సంరక్షణ, విద్యాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాల్య విహాలను ఎవరూ ప్రోత్సహించవద్దన్నారు. చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో డేవిడ్ రాజు, డాక్టర్ పద్మ, ఎంఈవో రమణాజీ, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు, సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుజాత, లక్ష్మి, కలిషా బేగం తదితరులు పాల్గొన్నారు.

చిరు జల్లులు చలిగాలులు


జన సంచారం లేని ప్రధాన రహదారి

పెదగంట్యాడ: చలికాలంలో కురిసిన అకాల వర్షానికి ప్రజలు వణికిపోయారు.చలి గాలులకు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో రోడ్లన్నీ బోసిపోయాయి. బుధవారం తెల్లవారు జాము నుంచి కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు చేరింది. నడుపూరు, గోపాల్‌రెడ్డినగర్, గాంధీనగర్, స్వతంత్రనగర్, బర్మా కాలనీ, డెయిరీ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, రామచంద్రనగర్, బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీ, రిక్షా కాలనీల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

చిత్తడి... చిత్తడి

అగనంపూడి: ఓ పక్క చిన్నా చితకా వర్షాలు.. మరో పక్క అసంపూర్తి పనులతో కూర్మన్నపాలెం ముస్తాఫా కూడలిలో ప్రయాణికులు, స్థానికులు ఫీట్లు చేస్తున్నారు. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కూడలికి రెండు వైపులా బీటీ రోడ్డు అంచుల వద్ద తవ్వి వదిలేయడంతో వర్షపునీరు చేరి నిల్వ ఉండిపోతుంది. కూడలికి కుడి, ఎడమ వైపుల్లో భవన నిర్మాణాలు సాగుతుండడం, నీరు రోడ్డు మీద నిల్వ ఉండిపోవడంతో అటుగా వెళ్లే ప్రయాణికుల పైకి బురదనీరు తుళ్లుతోంది. అలాగే రిలయన్స్ ఔట్‌లెట్ పాయింట్‌కు ఎదురుగా పెద్ద ఎత్తున బురద చేరడంతో నడిచివెళ్లే ప్రయాణికులకు అగచాట్లు తప్పడం లేదు. కూడలిలో రోడ్డుకు రెండువైపులా కూరగాయలు, పండ్ల దుకాణాలు, తోపుడుబళ్ల వ్యాపారాలు సాగుతుండడంతో నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో వేలాది మంది మార్కెట్ చేసుకోడానికి వస్తున్నారు. వారంతా అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


నిర్మానుష్యంగా నెల్లిముక్కు ప్రధాన రహదారి


జన సంచారం లేని పెదగంట్యాడ ప్రధాన రహదారి


ముస్తాఫా కూడలిలో ప్రధాన రహదారిపై చేరిన వర్షపునీరు

ఇంధన పొదుపు పాటించాలి


మాట్లాడుతున్న ఈపీడీసీఎల్ ఈఈ నాయుడు

అగనంపూడి: భవిష్యత్ అవసరాల కోసం ఇంధన (శక్తి) పొదుపు పాటించాలని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.కె.నాయుడు అన్నారు. ఇంధన పొదుపు (పరిరక్షణ)వారోత్సవాల్లో భాగంగా బుధవారం దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ సిద్ధంగా మానవాళికి లభ్యమయ్యే అన్ని రకాల ఇంధనాలను పొదుపుగా వినియోగిస్తే భావితరాలకు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థి ప్రతీ విషయంలో పొదుపును అలవర్చుకోవాలని, అప్పుడే పది మందికి వీటిపై అవగాహన కల్పించగలుగుతారన్నారు. అవసరం మేరకు శక్తిని వినియోగించేలా చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, డీఈఈ కె.రామకృష్ణ, ఏఈ వి.వీర్రాజు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనభ్యసించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ డీవీ రమణమూర్తి

అక్కిరెడ్డిపాలెం: విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ డి.వి.రమణమూర్తి అన్నారు. నడుపూరు రామచంద్రనగర్‌లోని ఎం.వి.ఆర్ పీజీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రమణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు సమసమాజ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా ప్రతీ ఒక్కరు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.రామారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.కృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై.ఈశ్వరరాజు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వి.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత, హస్త కళలను ప్రోత్సహించాలి


హస్తకళా ప్రదర్శన ప్రారంభిస్తున్న కళాక్షేత్రం కార్యదర్శి నర్సింగరావు

ఉక్కునగరం: దేశ ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు చేనేత, హస్తకళలని.. వాటిని ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కళాక్షేత్రం కార్యదర్శి డొక్క నర్సింగరావు అన్నారు. చేనేత హస్త కళా కార్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ ప్రస్తుత పాశ్చాత్య ధోరణుల వల్ల ప్రాచీన సంప్రదాయాలను మరిచిపోతున్నారన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, ప్రాంతాలకు చెందిన వస్తువులను ఒకేచోట ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఉక్కు ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సేవా సంఘం నిర్వాహకుడు హరీష్ మాట్లాడుతూ ప్రదర్శనలో అన్ని రకాల చేనేత వస్త్రాలు, హస్త కళలకు చెందిన వస్తువులను అందుబాటులో ఉంచామన్నారు. జనవరి 20 వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం. త్రినాథ్, కోశాధికారి ఎస్. వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.